క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



భూపాలపల్లి రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సన్ వ్యాలీ హైస్కూల్ విద్యార్థి హర్షిత్‌రావు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సురేశ్, ప్రిన్సిపాల్ సతీశ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెలక్షన్‌లో జూనియర్స్ విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థి హర్షిత్‌రావుకు ఉపాధ్యాయులు శనివారం అభినందనలు తెలిపారు.

నియామకం



రాజవీరుగౌడ్, అధ్యక్షుడు

భూపాలపల్లి రూరల్: ఎల్‌పీజీ డీలర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామానికి చెందిన కంకటి రాజవీరుగౌడ్‌ను శనివారం జిల్లా కేంద్రంలో నియమించారు. ప్రధాన కార్యదర్శిగా పల్లేరు దామోదర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కోశాధికారి గా లక్ష్మీపతి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా శ్రీలతరాణి, దేవరాజ్, సాయిరెడ్డి, సురేష్ తదితరులు ఎన్నికయ్యారు.

జిల్లా కమిటీ ఎన్నిక



బైరి నర్సింహస్వామి అధ్యక్షుడు



ఎండీ షహీద్ ప్రధాన కార్యదర్శి

భూపాలపల్లి రూరల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ (ఆర్‌యూపీపీ-టీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆకమిటీ రాష్ట్ర ప్రతినిధులు లక్ష్మయ్య, అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బైరి నర్సింహస్వామి, ఉపాధ్యక్షులుగా కుసుమ నరేశ్, శరత్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ షాహీద్, మహిళా విభాగంలో ఉపాధ్యక్షురాలు శిరీష బాయి, కార్యదర్శిగా జ్యోతితో పాటు తదితర సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా పొన్నం భిక్షపతిగౌడ్



టేకుమట్ల: బహుజన సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన పొన్నం భిక్షపతిగౌడ్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా పొన్నం భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి బహుజన రాజ్యాధికారాన్ని తీసుకొచ్చేందుకు శ్రమిస్తానన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కేవలం బహుజన సమాజ్‌వాదీ పార్టీతోనే సాధ్యమని, రానున్న రోజుల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కర్రవానిగుంపు గిరిజన గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దుప్పట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. శనివారం కర్రవానిగుంపు గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చేతుల మీదుగా 50 మందికి దుప్పట్లను అందజేశారు.

కోనోకార్పస్ చెట్లతో ప్రమాదం!

- శ్వాసకోశ వ్యాధులు వస్తాయని పలువురి హెచ్చరిక
- తొలగించాలని గ్రామస్తుల డిమాండ్



పల్లె ప్రకృతి వనంలో కోనోకార్పస్ చెట్లు

చిట్యాల: మండలంలోని 25 గ్రామాల్లో సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో రోడ్డు వెంట, పల్లె ప్రకృతి వనాలలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి ముప్పుగా మారాయి. ప్రజలలో శ్వాసకోశ సంబంధించిన వ్యాధులకు కారణమవుతునాయని ఈ మొక్కలను తొలగించాలని పలువురు శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాలలో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హానీ కలిగిస్తుంటాయి. అలాగే ఈ చెట్లపై ఒక్క పిట్ట కూడా వాలడం లేదంటే ఈ చెట్టు పర్యావరణానికి ఎంతో హానీకరమో అర్థమవుతోంది. ఈ మొక్కలు విపరీతంగా పెరిగి పచ్చదనంతో నిండుకుని ఆహ్లాదకరంగానే ఉంటాయి కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అంత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరికి అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు, సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా గ్రామాలలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో వేరే చెట్లను నాటాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

కాటారం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ప్లే కార్డులు ప్రదర్శించి తమ అందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యాశాఖలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి, పాఠశాలలకు మధ్య అనుసంధానకర్తలుగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధర్నాలు చేసినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో మద్దతు తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన తమను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం, మల్హర్, మహాముత్తారం సమగ్ర శిక్ష ఉద్యోగులు సిరిసిల్ల వరప్రసాద్, రవిశంకర్, సురేశ్, సంపత్, సుదర్శన్, సమ్మయ్య, రోజారాణి, స్వరూప, కేజీబీవి ఉపాధ్యాయినీలు రాజేశ్వరీ, నళిని, కవిత, స్వప్న, శ్రీలత, అరుణ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన భూపాలపల్లి మండలం మోరంచపల్లిలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం నుంచి సుగుణ భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి మండలం కొత్తపల్లి(ఎస్ఎం)లోని బంధువుల ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో మోరంచపల్లి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొట్టడంతో మహిళ ఎడమ కాలు విరిగిపోయింది. దీంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.

గుడుంబా స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్‌లో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు. ఏఎస్సై తెలిపి న వివరాల ప్రకారం.. శనివారం ఉదయం మండలంలోని పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో రాఘవాపూర్‌లో చిట్యాల మండలంలోని కాల్వపెల్లి గ్రామానికి చెందిన అట్కూర్ రాజునా యక్ అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. కాగా, అతడి వద్ద 5లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ మహేందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండ: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పసుల సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు దగ్గు వెంకటేశ్వరరావు, బండి రమేశ్ ఉన్నారు.

రాఘవరెడ్డిపేటలో..

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మి శుక్రవారం అ నారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీటీసీల సంగి రవి శనివారం పరామర్శించారు. ఆయన వెంట బొజ్జపల్లి శంకర్, సంగి చంద్రయ్య, అంజయ్య, లింగయ్య, రవి, సారయ్య, నర్సయ్య, పవన్‌కల్యాన్, అశోక్, సంపత్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

'భూములు లాక్కుంటే ఊరుకోం..'

పలిమెల: పూర్వం నుంచి పంటలను సాగు చేసుకుంటున్న రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతం నుంచి పేదలు సాగు చేసుకుంటున్న బంజరావి భూములను స్థానికేతరులు అక్రమంగా పట్టాలను చేపించుకుని ఇటీవల ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు అమ్మడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల భూములను లాక్కుంటే ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలు రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టినా అడుగడుగునా అడ్డుకుంటామని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు ఉన్నారు.

వామ్మో చలి..



రామకిష్టాపూర్(టి)లో చలిమంటలు కాగుతున్న మహిళలు

జిల్లాలో మూడ్రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉదయం, సాయంత్రం చలి తీవ్రత పెరిగింది. చల్లటిగాలులు వీస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్లు దాటి వెళ్లలేని పరిస్థితి. కొందరు స్వెటర్లు, దుప్పట్లు కప్పుకుని చలి నుంచి ఉపశమనం పొందుతుండగా.. మరికొందరేమో చలి మంట కాచుకుంటున్నారు.

\- టేకుమట్ల

రూ.18వేల వేతనం అందించాలి

ములుగు రూరల్: ఆశవర్కర్లు నెలకు రూ.18 వేల వేతనం అందించే విధంగా అసెంబ్లీ సమావేశాలలో నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకేంద్రంలో ఆశవర్కర్ల బస్సు యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ నెల 15న నిర్మల్ జిల్లాలో బస్సు యాత్ర ప్రారంభమై 27న ములుగు జిల్లాకు చేరుకుంటుందని 31న హైదరాబాద్‌లో బాద్ ఇందిరా పార్కు వద్ద ముగుస్తుందని అన్నారు. బస్సు యాత్రలో ఆశవర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. నీలాదేవి, రజియా, సుజాత, రజిత, కేత, కవిత పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడి వెలిగిస్తున్న భక్తులు

గణపురం: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి మహా దివ్య పడిపూజ శనివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన సూర్యదేవర కార్తీక్ స్రవంతి దంపతులు ఏర్పాటు చేసిన మహా పడి పూజను ఆరెపెల్లి హరిహర క్షేత్ర పధాన అర్చకుడు శ్రీ పద్మనాభ గురుస్వామి చేతుల మీదుగా అయ్యప్ప మాలధారులు, భక్తుల మధ్య అంగ రంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలు, గంధం, విభూది, కుంకమలతో ఘనంగా అభిషేకం చేశారు. అనంతరం పడిపూజ నిర్వహకుడు కార్తీక్ చేతుల మీదుగా పడిని వెలిగించారు. అనంతరం అయ్యప్ప మాల దారులకు, భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు యామ సుధీర్, మామిండ్ల కిష్టస్వామి, మామిండ్ల మోహన్, గుర్రం తిరుపతి, పల్లె పరమేశ్, ఆవుల కిరణ్‌తో పాటు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలదారులు,భక్తులు పాల్గొన్నారు.

వీరన్న కుటుంబాన్ని ఆదుకోవాలి

- పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి రాజు



సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాటారం: విధి నిర్వహణలో వెళ్తూ రైలు ఢీకొని మృతి చెందిన గురుకులం పార్ట్‌టైం పీఈటీ వీరన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన గురుకుల బాలుర, బాలికల కళాశాల పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి రాజు, కళాశాల అధ్యక్షుడు మంథెన శ్రీనివాస్ కోరారు. వీరన్న మృతికి సంతాపంగా కళాశాల ఆవరణలో శనివారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరన్న పార్ట్ టైం పీఈటీగా గురుకులంలో 2001 నుంచి విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన మృతి తీవ్ర బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. వీరన్న పిల్లల చదువు బాధ్యత గురుకుల సొసైటీ చూసుకోవాలని అన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్‌లో నింపిన ఇసుక

కాటారం: మండలంలో ఎక్కడ ఇసుక కనబడితే చాలు ఇసుక రవాణాదారులు వెనుకా ముందు చూడకుండా ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. కాటారం మండలం బొప్పారం సమీపంలోని వాగు నుంచి పలువురు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు పలువురు రైతులు, గ్రామస్తులు ఆరోపించారు. ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో సమీపంలోని పంట పొలాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇష్టానుసారంగా ఇసుక తీయడంతో నీరు నిల్వక సమీపంలోని పొలాలకు సాగు నీరు కష్టం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఇంత పెద్ద మొత్తంలో ఇసుక రవాణా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతోనే అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుందని పలువురు తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

కొత్త మెనూతో ఆరోగ్యానికి మేలు



చిట్యాల: కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



రేగొండ: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్వేత

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: కొత్త మెనూతో విద్యార్థుల ఆరోగ్యానికి మెలు అని ఎమ్మెల్యే గండ్ర గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కామన్ మెను చార్ట్‌ను ఆయన శనివారం ప్రారంభించి మట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ఏనాడు విద్యార్థులను పట్టించుకోలేదన్నారు. విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి హాస్టళ్ల విద్యార్థులకు మెను ప్రకారం భోజన వసతులను ఏర్పాటు చేసి నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే వంట గదిలో ఉన్న సరుకులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను ప్రిన్సిపాల్ భిక్షపతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి వాష్ రూమ్‌ల మరమ్మతుల కోసం రూ.మూడున్నర లక్షలు నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో గదులు కురుస్తున్నాయని తెలుపడంతో వాటికి మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ చిన్నయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి కొమురయ్య, నాయకులు కిష్టయ్య, రాయకోంరు, బుర్ర లక్ష్మన్, గుర్రపు తిరుపతి గౌడ్, దబ్బెట అనిల్, అరెపల్లి నర్సింహారాములు, మైదం రాజ్‌కుమార్, గంగాధరి రవీందర్ పాల్గొన్నారు.

రేగొండ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మెనూతో విద్యార్థుల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకులంలో తహసీల్దార్ శ్వేత, లింగాలలోని ఎంజేపీ గురుకులంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు శనివారం న్యూ కామన్ డైట్ మెనూను ప్రారంభించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డైట్ చార్జీలు పెంచడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. డీసీఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ విజయ, ఆర్ఐ నరేష్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన యూనిడైట్ మెనూ చార్ట్‌ను మహదేవపూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూలో తెలిపిన విధంగా ప్రతిరోజు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. వారి వెంట హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి సరిత, తదితరులు ఉన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎస్టీ హాస్టల్‌లో కామన్ డైట్ ప్లాన్‌ను ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని స్టోర్ రూంను సందర్శించి కూరగాయలు, సరకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించిందని తెలిపారు. వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. దీంతో పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం అందాలని, వారు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని వెల్లడించారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి అధికారులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి వినయ్‌భాస్కర్, హాస్టల్ వార్డెన్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



రేగొండ: న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



మల్హర్: విద్యార్థులతో భోజనం చేస్తున్న అధికారులు



కాళేశ్వరం: వంట గదిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంకర పోశారు.. వదిలేశారు

- ఏడాది గడిచినా పూర్తికాని రోడ్డు నిర్మాణ పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకర పోసి వదిలేసిన రోడ్డు

ములుగు రూరల్: జిల్లా కేంద్రం నుంచి దేవగిరిపట్నం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో జాప్యం జరుగుతోంది. ములుగు తోపుకుంట నుంచి రోడ్డు విస్తీర్ణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ ఏడాది గడిచిన పూర్తి చేయడం లేదు. ములుగు నుంచి అన్నంపల్లి వరకు రోడ్డు పనులు పూర్తి అయిన అన్నంపల్లి నుంచి దేవగిరిపట్నం వరకు కంకర పోసి వదిలేశారు. దీంతో జిల్లా కేంద్రం నుంచి దేవగిరిపట్నం, పత్తిపల్లి, చింతలపల్లి, పొట్లాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు పనులు చేపట్టక పోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ధూళీ రోడ్డు పక్కన పంటలపై పడి రైతులు పంటలు నష్టపోతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రోడ్డు నిర్మాణ పనులు ఏడాది కాలంగా పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అన్నంపల్లి–దేవగిరిపట్నం మధ్యలో రోడ్డుపై కంకరపోసి వదిలేశారు. రోలింగ్ చేయకపోవడంతో ద్విచక్రవాహనాలు నడపడం ఇబ్బందికరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

\- కుమ్మిత అంకిరెడ్డి, పొట్లాపూర్

రేపు జిల్లా జట్ల ఎంపిక

కాటారం: మండలంలోని మేడిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఈనెల 16న జిల్లా బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక చేపట్టనున్నట్లు బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మంచిక నరసింహారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో జరగబోయే సీఎం కప్–24 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్, ఈనెల చివరి వారంలో జరగనున్న సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు భూపాలపల్లి జిల్లా తరపున మెన్, ఉమెన్ జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి గల క్రీడాకారులు సీఎం కప్–24 రిజిస్ట్రేషన్ ఐడీ, ఆధార్‌కార్డు, పాస్‌ఫోటో, సొంత కిట్‌లతో హాజరు కావాలని సూచించారు. జిల్లా క్రీడాధికారి రఘు సమక్షంలో ఈ ఎంపికలు జరుగుతాయని సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఈరగోని రాజు, వీరన్న, పూర్ణిమ వ్యవహరించనున్నట్లు చైర్మన్ నరసింహారామయ్య తెలిపారు.